## క్లుప్తంగా

### వివేకానంద ఆశ్రమంలో వైద్య శిబిరం



మందులు అందిస్తున్న డాక్టర్ సూర్యతేజ

**దాబాగార్డెన్స్:** స్నేహ సంధ్య ఏజికేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్నవారికి గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సలహా మేరకు మందులు తీసుకుని, నిత్యం చిన్న చిన్న వ్యాయామాల ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. వైద్య శిబిరంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పుండరీకాక్షయ్య, ప్రసాద్‌నాయుడు, కమల ప్రియ, వైద్య బృందం పాల్గొన్నారు.

### అన్నసమారాధన



వడ్డన చేస్తున్న ఆలయ కార్యవర్గ సభ్యులు

**అల్లిపురం:** కెప్టెన్ రామారావు జంక్షన్‌లో కొలువైన శ్రీ రేణుక యల్లమ్మ ఆలయంలో గురువారం ఆలయ సహాయ కార్యదర్శి బడే నాగరాజు ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలరావు, వాసుపల్లి నారాయణ, ఆలయ ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్ అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

### హార్ట్ హెల్త్ చెకప్ కూపన్ల పంపిణీ



హార్ట్ హెల్త్ చెకప్ కూపన్లు అందిస్తున్న ఓమ్ని ఆస్పత్రి ప్రతినిధులు

**దాబాగార్డెన్స్:** ఓమ్ని హాస్పటల్ సామాజిక సేవలో భాగంగా గురువారం ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. నగర పరిధిలోని 14 ప్రాంతాల్లో ఎన్‌సీసీ కేడెట్లు, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. యువతకు హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ఆవశ్యకతను వివరించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ అనర్థాలపై అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు ఆస్పత్రి ఉచితంగా అందించే హార్ట్ హెల్త్ చెకప్ కూపన్లు పంపిణీ చేశారు. కూపన్ల ద్వారా ఉచిత కన్సల్టెన్సీ, గుండె ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు ఓమ్ని ఆస్పత్రి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రావి శ్రీనివాసరావు తెలిపారు.

### సిరులతల్లికి పంచామృతాభిషేకం

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనతాబజార్.. 70వ దశకంలో విశాఖ నగర వాసులకు వన్ స్టాప్ షాపింగ్ మాల్. కిరాణా సామగ్రి నుంచి దుస్తులు, స్టేషనరీ, ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు ప్రజల ప్రతి అవసరాన్ని ఇదే తీర్చేది. సూపర్ మార్కెట్లు, చైన్ మాల్స్ రాకతో దీని ప్రాభవం తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరి, ఏ క్షణాన కూలిపోతుందోనన్న భయాన్ని పెంచుతోంది. పైపెచ్చు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. దీన్ని వీలైనంత వేగంగా పడగొట్టి, పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- శిథిల భవనంతో భయం భయం
- అద్దెలు చెల్లించరు.. ఖాళీ చేయరు
- ఇష్టారాజ్యంగా స్క్రాప్ వ్యాపారం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

# జనతా బేజార్



అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారిన స్క్రాప్ వాహనాలు

**జగదాంబ:** జీవీఎంసీ 35వ వార్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా 1972లో ఈ జనతా బజార్‌ను నిర్మించారు. అప్పట్లో 72 దుకాణాలతో ప్రారంభించారు. సరైన నిర్వహణ లేకపోవడం, దాదాపు 52 ఏళ్లు గడిచిపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. స్క్రాప్ వాహనాల యార్డుగా మారి, గంజాయి, మద్యపానం తదితర అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. గతేడాది జూలైలో దీన్ని పడగొట్టేందుకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. ప్రత్యామ్నాయ వసతి చూపించేంత వరకు శిథిల భవనాన్ని కూల్చవద్దంటూ కొందరు మొరపెట్టుకున్నారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఈ భవన తొలగింపు ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మిగిలింది.

**ఖాళీ చేయరు.. అద్దె చెల్లించరు**

ఈ సముదాయంలో ఉన్న 72 దుకాణాలకు జీవీఎంసీ బహిరంగ వేలం ద్వారా వ్యాపారులకు అప్పగించింది. వేలంలో ఈ దుకాణాలను దక్కించుకున్నవారెవరూ ప్రస్తుతం ఈ దుకాణాల్లో లేరు. ఓ పెద్ద మనిషి దుకాణాలను ఆక్రమించుకుని అద్దెకిచ్చేశాడు. ఆయనగానీ, దుకాణాలు నడుపుతున్న వారుగానీ అద్దెలు చెల్లించట్లేదు. జీవీఎంసీ అద్దె వసూళ్లకు నోటీసులు జారీ చేస్తే.. కోర్టునాశ్రయించారు. కోర్టు కూడా బకాయిలతో సహా అద్దెలు చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. కూల్చివేతకు కూడా ఆమోదం తెలిపింది. కానీ ఇప్పటి వరకు బకాయిలూ చెల్లించక, దుకాణాలనూ ఖాళీ చేయక అక్కడే కొనసాగుతున్నారు.

**శిథిల భవనం.. స్క్రాప్ వ్యాపారం**

కాలం చెల్లిన ఈ భవనానికి వెనుక భాగంలో సముద్రంలోకి వెళ్లే మురుగునీటి కాలువ ఉంది. భవనం శిథిలం కావడంతో ఆ శిథిలాలు కొన్ని కాలువలో చేరి, భవనం వెనుక భాగం ఎప్పుడూ చెమ్మతోనే ఉంటుంది. ఈ దుర్వాసన భరించలేనిదిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ఇక్కడి వారు భయం భయంగా గడుపుతున్నారు. ఏ క్షణాన ఇది నేల కూలి, ఎందరి ప్రాణాలను బలి తీసుకుంటుందోనని భయపడుతున్నారు. ఇక్కడ నడుస్తున్న దుకాణాలు చాలా వరకు స్క్రాప్ వ్యాపారం చేసేవే. దుకాణాలతో పాటు, ఫుట్‌పాత్‌లు, రోడ్డును కూడా ఈ తుక్కు వాహనాలతో కబ్జా చేస్తున్నారు.



కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న దుకాణ సముదాయం

**వెండి కిరీటం తొడిగి.. వేడుకోలు!**

శిథిలావస్థకు చేరిన జనతా బజార్‌ను కూల్చివేయకుండా ఆపేందుకు వ్యాపారులు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. జీవీఎంసీ ప్రయత్నాలను రాజకీయంగా అడ్డుకునేందుకు మూడు మాసాల కిందట ఓ కార్యక్రమాన్ని నిర్వహించి ఎంపీ శ్రీభరత్‌ను ప్రత్యేక ఆహ్వానితుడిగా రప్పించారు. ఆయన నెత్తిన వెండి కిరీటం తొడిగి మరీ.. జనతా బజార్ భవనాన్ని తొలగించకుండా చూడాల్సిందిగా విన్నవించుకున్నారు. స్థానిక అధికారులతో మాట్లాడిన ఆయన కోర్టు ఆదేశాలున్నాయని, కూల్చివేతల్ని ఆపలేనంటూ బహిరంగంగా చెప్పారు. ఆ మేరకు జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఇది జరిగి మూడు నెలలవుతోంది. కోర్టు ఉత్తర్వులపై జీవీఎంసీ చర్యలు శూన్యం. లోగుట్టు ఎంపీ శ్రీభరత్‌కే ఎరుక.

### అసాంఘిక కార్యకలాపాల నిలయం

ఇక్కడున్న స్క్రాప్ దుకాణాలకు చెందిన వాహనాలే సుమారు 100 వరకు రోడ్డుపైనే ఉంటాయి. వీటిలో చాలా వాహనాలకు సరైన పత్రాలు కూడా ఉండవు. ఎక్కువగా దొంగిలించిన వాహనాలు ఇక్కడికి వస్తాయని ఆరోపణ. రాత్రుళ్లు శిథిల భవనంతోపాటు, ఈ వాహనాలు కూడా అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. స్క్రాప్ వాహనాల్లో, వాటి వెనుక కూర్చుని గంజాయి, మద్యం సేవిస్తూ.. రోడ్డుపై వెళ్లేవారికి నిత్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ రోడ్డును ఆరుబయలు బహిర్భూమిగా కూడా మార్చేశారు. నిత్యం ఈ దారిలోనే వన్ టౌన్ పోలీసులు తిరుగాడుతున్నా.. ఈ వ్యవహారాల్ని పట్టించుకున్న పాపాన పోవట్లేదు. రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలతో జీవీఎంసీ సిబ్బంది పారిశుధ్య నిర్వహణ పనులు చేసేందుకూడా వీల్లేని దుస్థితి.

### చర్యలు తీసుకుంటున్నాం



జనతాబజార్ శిథిల భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అందులో ఉన్న వ్యాపారులందరికీ నోటీసులు జారీ చేశాం. బకాయి అద్దెల వసూళ్లపై కూడా సిబ్బందికి ఆదేశాలిచ్చాం. వీలైనంత వేగంగా ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే విద్యుత్ కనెక్షన్లు కట్‌చేస్తాం.

– ఎం.మల్లయ్యనాయుడు, జోన్–4 కమిషనర్, సూర్యాబాగ్

### మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో రవీంద్రభరత్

**దాబాగార్డెన్స్:** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్, జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపనకనకరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ నేతృత్వంలో జగన్‌ను కలిసి, పార్టీ కార్యక్రమాలపై మాట్లాడారు.

### అర్ధాకలితో అలమటిస్తున్నాం

- 150 మంది విద్యార్థినులకు 60 గుడ్లు
- విద్యార్థినులతోనే మరుగుదొడ్ల క్లీనింగ్
- కలెక్టర్‌కు ఎస్సీ హాస్టల్ విద్యార్థినుల మొర

**మహారాణిపేట:** పాత జైలురోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎస్సీ హాస్టల్‌లో మెనూ అమలు చేయట్లేదని, ఆకలి తీరేంత భోజనం కూడా పెట్టట్లేదని విద్యార్థినులు కలెక్టర్ వద్ద వాపోయారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి గురువారం వినతి పత్రం అందించారు. మరుగుదొడ్లు కూడా తమతోనే శుభ్రం చేయిస్తున్నారని, హాస్టల్లో 150 మంది పిల్లలు ఉంటే 60 గుడ్లు మాత్రమే ఇస్తున్నారన్నారు. కాస్మోటిక్ చార్జీలివ్వట్లేదని, కారణం లేకుండా తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతుల కోసం వార్డెన్‌ను అడిగితే, ప్రభుత్వ హాస్టల్లో సీటు ఇవ్వకపోయినా, కష్టబడి సీటు ఇచ్చినట్లు చెప్తున్నారని తెలిపారు. శానిటరీ ప్యాడ్స్ కూడా ఇవ్వట్లేదన్నారు. అన్ని పనులూ పిల్లలతోనే చేయిస్తున్నారని ఆ వినతిపత్రంలో వెల్లడించారు.

## గౌరమ్మకు సారె సమర్పణ



గౌరీ మాతకు సారె తీసుకెళ్తున్న మహిళలు

**అల్లిపురం:** వేంకటేశ్వరమెట్టపై వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వర మహోత్సవాల్లో భాగంగా భక్తులు గురువారం సారె సమర్పించారు. 33వ వార్డు బంగారుమెట్ట కాలనీకి చెందిన మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు, మిఠాయిలు, కొబ్బరిబొండాలు, అరటి పండ్లు తదితర సారెను ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు వారికి స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, ప్రసాదం అందించారు.

## బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్



సబా టబాస్సమ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపక బృందం

**దాబాగార్డెన్స్:** విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న సబా టబాస్సమ్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 8 నుంచి 10 వరకు మహారాష్ట్రలో జరిగిన రాణీ లక్ష్మీభాయి ఫస్ట్ గరల్స్ అండ్ వుమెన్ ఆలిండియా బాక్సింగ్ ఇన్విటేషనల్ టోర్నీ 52–54 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్‌తోపాటు, బెస్ట్ ప్రామిసింగ్ బాక్సర్ అవార్డు గెలుచుకుంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల గురువారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాలల నేస్తం.. చాచా నెహ్రూ

- వాడవాడలా బాలల దినోత్సవం
- జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి



పాపాహోం విద్యార్థులతో కేవీ రామకృష్ణ ప్రసాద్

**అల్లిపురం:** పాపాహోమ్‌లో ఆశ్రయం పొందిన ప్రతి విద్యార్థి చక్కగా చవుదుకుని అత్యున్నత శిఖరాలను అధిరోహించాని ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్పీ కేవీ రామకృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్‌లోని పాపాహోమ్ ప్రాంగణంలో గురువారం చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సృష్టిలో చదువు కన్నా గొప్పది ఏదీ లేదన్నారు. చదువు ప్రాముఖ్యతను విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలన్నారు. అనంతరం పాపాహోమ్ విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో హోమ్ అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి వీఎస్ ప్రకాశరావు, కోశాధికారి ఆర్పీ జైన్ తదితరులు పాల్గొన్నారు.

**అల్లిపురం:** చాచా నెహ్రూ స్ఫూర్తితో ఏటా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు దాబాగార్డెన్స్ రవీంద్రభారతి స్కూల్ చైర్మన్ ఎంఎస్ తెలిపారు. బాలల దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదని సమాజంలో పిల్లల ప్రాముఖ్యతను చాటి చెప్పే గొప్ప కార్యక్రమమన్నారు. నేటి పిల్లలే రేపటి దేశానికి నిజమైన శక్తి రూపాలని, వారికి మెరుగైన విద్య అందించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న కొల్లి సింహాచలం

**దాబాగార్డెన్స్:** 39వ వార్డు పరిధి కన్వేయర్ బెల్ట్, పద్మానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో సమిష్టి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు, కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు రమణమ్మ, పైడిరత్నం, అనిల్, మణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

**రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో..**

రోటరీక్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, క్యారేజీలు పంపిణీ చేశారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ ధర్మేంద్ర, కార్యదర్శి శ్రావణి, యూత్ సర్వీసెస్ డైరెక్టర్లు ఆశా జాస్తి, కరుణ పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. బాల్యం ఎంతో మధురమైనదని, పిల్లల్ని చిన్నప్పటి నుంచి ప్రోత్సహించడం ద్వారా వారు జీవితంలో రాణించేలా చేయొచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అవంతి, శ్రీదేవి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాపేటి చంద్రశేఖర్



రవీంద్రభారతి స్కూల్‌లో..

**అల్లిపురం:** బాలల దినోత్సవం సందర్భంగా వేంకటేశ్వరమెట్ట గౌరీ వివేక్ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ట్యూషన్ సెంటర్ డైరెక్టర్లు రాపేటి చంద్రశేఖర్, రాపేటి గుణవతి మాట్లాడుతూ చిన్నారులంటే చాచా నెహ్రూకు ఎంతో ఇష్టమన్నారు. చిన్నారుల మధ్య కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

## గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



నెహ్రూబజార్ ప్రాంతీయ గ్రంథాలయంలో..



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఏఎంవోహెచ్ కృష్ణంరాజు

**దాబాగార్డెన్స్:** నియోజకవర్గ పరిధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖా గ్రంథాలయాలు, కళాశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. 160 ఏళ్ల ఘన చరిత్ర గల ఏవీఎస్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు వారోత్సవాలను ప్రారంభించారు. ఇక్కడి గ్రంథాలయంలో ప్రదర్శనకు ఉంచిన పురాతన గ్రంథాలు సందర్శకులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవచ్చన్నారు. గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ ప్రెసిడెంట్ ఎండీ యాసీన్‌బాబా, సెక్రటరీ చింతా నేతాజీ, కళాశాల పూర్వ విద్యార్థి, కళాశాల అభివృద్ధికి రూ.60 లక్షలు భూరి విరాళం అందించిన సీవీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, లైబ్రేరియన్ స్వరాజ్యలక్ష్మి, ప్రియాంక, అనితాకుమారి పాల్గొన్నారు.

**బాలల శాఖ గ్రంథాలయంలో..**

పూర్ణామార్కెట్ దరి రంగిరీజువీధిలోని బాలల శాఖా గ్రంథాలయంలో ఏవీఎస్ హైస్కూల్ హెచ్‌ఎం ఎంవీ భానుమతి, కేకే మహాలక్ష్మి, రామచంద్ర పాఠశాల హెచ్‌ఎం శ్యామల వారోత్సవాలు ప్రారంభించారు. ముందుగా సరస్వతీదేవి, చాచా నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి వారం రోజులు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులచే జాతీయ గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, మ్యూజికల్ చైర్, తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అప్పలరాజు, ఎల్లయ్య, ఎల్లారావు, పద్మ పాల్గొన్నారు.

**ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..**

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల ప్రారంభించారు. పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎస్.అనురాధ, లైబ్రరీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎ.ధరణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అల్లిపురం:** గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకుని, జ్ఞానసముపార్జన చేయాలని జోన్–4 ఏఎంవోహెచ్ కృష్ణంరాజు సూచించారు. అల్లిపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి, మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, విద్యార్థులు వాటిని సద్వినియోగపరచుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి పీవీ నూకరాజు మాట్లాడుతూ ఈ నెల 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. ప్రతి రోజు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు.



ఎస్ఆర్ రంగనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

**సీతమ్మధార:** విద్యార్థులు పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలని ప్రముఖ రచయిత మేడా మస్తాన్‌రెడ్డి అన్నారు. నెహ్రూబజార్ దరి ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి, మాట్లాడారు. దేశ నాయకుల జీవిత చరిత్రలు చదివి, వారి ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ప్రముఖ రంగస్థల నటుడు వర్రే నాంచారయ్య మాట్లాడుతూ, విద్యార్థులంతా పాఠ్య పుస్తకాలతో పాటుగా దేశ నాయకుల చరిత్రలు చదవాలన్నారు. మరో వక్త విజయరామరాజు మాట్లాడుతూ, విద్యార్థులు మొబైల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రతినిధులు బీఏ పద్మావతీదేవి, ఎ.శాంతి భూషణ, కె.పైడిరాజు, రికార్డు అసిస్టెంట్ ఎ.శంకరరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



బాలల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి

### నాసా ప్రాజెక్టుకి శ్రీచైతన్య విద్యార్థులు



నాసా ప్రాజెక్టుకు ఎంపికైన శ్రీచైతన్య విద్యార్థులు

**సీతమ్మధార:** శ్రీచైతన్య ద్వారకానగర్ శాఖలోని 18 మంది విద్యార్థులు జాతీయ స్థాయి నాసా స్పేస్ సెటిల్‌మెంట్ ప్రోగ్రాం–2025కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవికిరణ్ గురువారం మీడియాకు తెలిపారు. 2005 మేలో జరిగేన నాసా అంతరిక్ష శాస్త్రవేత్తల సమావేశానికి సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ఏయూ ప్రొఫెసర్ వజీర్ మహమ్మద్ చేతుల మీదుగా 18 విద్యార్థులకు నాసా కిట్లను అందించారు. అందజేశారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉత్తరాంధ్ర జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం సురేష్ అభినందించారు. ప్రాంతీయ సంచాలకుడు మహమ్మద్ అలీ, డీన్లు గౌరినాయుడు పాల్గొన్నారు.

### ఆరోగ్య సంరక్షణ పోస్టర్ ఆవిష్కరణ

**మహారాణిపేట:** ఆరోగ్య సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్‌ను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ గురువారం ఆవిష్కరించారు. కేజీహెచ్ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దీన్ని ఆవిష్కరించి అవగాహనతోనే చాలా రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ధవళ భాస్కరరావు, ఇతర వైద్యులు, నర్సులు పాల్గొన్నారు

### ఆర్టీసీ జోన్-1 ఈడీకి చైర్మన్ కొనకళ్ల పరామర్శ



బ్రహ్మానందరెడ్డిని పరామర్శిస్తున్న చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఇతర అధికారులు

**దాబాగార్డెన్స్:** ప్రమాదానికి గురై ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డిని గురువారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పలువురు అధికారులు పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆర్టీసీ చైర్మన్ వెంట జోన్–1 ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్ ఇతర అధికారులు ఉన్నారు. బ్రహ్మానందరెడ్డికి అందిస్తున్న చికిత్సను ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ వాణి నీలిమ, కిమ్స్ వైద్యాధికారి డాక్టర్ విజయ పర్యవేక్షిస్తున్నారు.